కథానిక

# పువ్వా - కాగితం పువ్వా

వి. నారాయణరావు

వనస్పతి అంటే— పువ్వులు పూయకుండా కాయలుకాసే చెట్టు. డాల్డా అంటే- వెన్న అక్కరలేకుండా తయారయే నెయ్యి. అందుకనే పట్నాల్లోవాళ్ళకి "వెన్నకాచిన నెయ్యి" అని ఒక సమాసం ఏర్పడింది. వెన్న కాయకుండా తయారయే నెయ్యి ఉంటుందని ఎరగని పల్లెటూరువాళ్ళకి యీ సమాసం అర్థంకాదు.

డాల్డానికూడా నెయ్యే అంటారు. వనస్పతిని కూడా చెట్టే అంటారు. ఎంతమంది యంత్రాలని మనం మనుషులనటంలేదు?

సర్ తామస్ గ్రెషామ్ అని ఒకాయన పూర్వం ఎలిజిబెత్ రాణీగారికి అర్థిక సలహాదారుడుగా ఉండేవాడు. ఆయన, చెడ్డనాణాలు వచ్చి మంచి నాణాలని మారకంలోంచి తరిమేస్తాయని ఒక సిద్ధాంతం చేశాడు. ఈసంగతి డబ్బుకేకాకుండా సామాన్యంగా అన్నింటికీ వర్తిస్తుందని కొంత మంది అంటారు. కాని యిలాంటి సంగతులేం మంచినెయ్యికి తెలియవు. డాల్డా వచ్చి తనని తరిమేస్తుందని మంచినెయ్యి పసికట్టలేదు. అమాయకురాలు- పాపం! పల్లెటూరిది.

* * *

శ్రీపతి చదువుకున్నవాడే- బాగా చదువుకున్న వాడే. చిన్నప్పటినుంచీ అతని అభిరుచులు విచిత్రంగా ఉండేవి. అతని వమ్మకాలూ, యిష్టాలూ, అయిష్టాలూ, యివేవీ అందరూపోయే దారిలో ఉండేవికావు. ఎవరికీ బాగుండని సినిమాలో, ఎవరూ బాగుంటుందని ఊహించని భాగం, శ్రీపతికి ఎందుకో నచ్చేది. అది బాగుందని అనుకోడం తప్పితే... ఎందుకు బాగుందో కారణం అతనికికూడా తెలియకపోయి ఉండాలి.

శ్రీపతి తెలివైనవాడు. ఈ సంగతి అతని మొహంచూడగానే తెలుస్తుంది. అతను ఎం. ఏ. ప్యాసయినా యింకా ఉద్యోగంమాత్రం చెయ్యటంలేదు. చేస్తాడో చెయ్యడో తెలియదు. ఉన్నవాడే కాబట్టి, పరవా ఏమీలేదు.

శ్రీపతి ఎం. ఏ. పాసయ్యేసరికే, బి. ఏ. చదువుతున్న వాళ్ళ మేనమామ కూతురొకతె ఉంది; శ్రీపతికోసం. ఆ అమ్మాయి పేరు ఉదయబాల. శ్రీపతి పరీక్ష ప్యాసయిన తరవాతనుంచీ మేనమామ, పెళ్ళివిషయం తొందరపడుతూనే ఉన్నాడు. శ్రీపతి నాన్నగారూ, యీసంబంధం చేసుకోవాలనే అనుకుంటున్నారు. కట్నం కావలసినంత యిస్తారు.

శ్రీపతి యీనాటివరకూ పెళ్ళివిషయం ఏ అభిప్రాయమూ బైటపెట్టలేదు. ఇందులో అతని అభిరుచులు ఎలా ఉంటాయో తెలీదు. వాళ్ళ నాన్నగారు అడిగినప్పుడుకూడా శ్రీపతి మౌనంగానే ఉన్నాడు. బహుశా అది అది అర్థాంగీకార సూచకం కావచ్చు. కాకపోతే ఉదయబాల వంటి స్త్రీ అర్థాంగి కాబోతూండగా వద్దంటాడా? కాని, చాలా విషయాలనుగురించి స్వంతంగా కొన్ని భావాలు ఏర్పరుచుకోగలిగిన వ్యక్తి పెళ్లినిగురించి యింత నిర్లిప్తతతో ఎలా ఉంటున్నాడా అని చాలామంది స్నేహితులకి అనిపించిన మాట నిజం.

ఉదయబాల చాలా అందమయినది. అతినవ్య నాగరికతకి ఆవిడ రూపొందిన ఆకారం. ఎత్తు మడమల బూట్లువేసుకుని, జుట్టు అందంగా కత్తిరించుకుని, చక్కగా అలంకరించుకుని, చేతిలో చాలా లావణ్యంగా ఒక సంచీ పుచ్చుకుని— ఆవిడ కాలుకదిపితే, అనేకవందల యువకుల కళ్లు అటు తిరిగేవి. ఈ యిరవయ్యో శతాబ్దపు సౌందర్యం శ్రీపతిలో ఏదో కదలిక కలిగించే ఉంటుంది. ఉదయబాలకి 'బావని' పెళ్ళాడాలని ఉన్నమాట వాస్తవం.

ఉన్నట్టుండి శ్రీపతి ఏదో ఊరు వెళ్ళాడు. ఒక్కొక్క సమయంలో అతనికొకబుద్ధి. పట్టణంలో ఏమీతోచటంలేదని ఒక పల్లెటూరు పోతాడు. తరచు ఏ చుట్టాలూ ఉండని పల్లెటూరు పోయి అక్కడ ఎవరినో కాస్త చోటడిగి, తను పట్టుకెళ్ళే ఏ పదార్థమో తిని, పడుకుంటాడు. పల్లెటూరువాళ్ళు మంచివాళ్ళంటాడు శ్రీపతి. పడుకోటానికి చోటడిగితే, పట్నంవాళ్ళలా అనుమానపడరు. ఏ చుట్టాలూ లేని ఊరికి, ఏ పనీ లేకుండా శ్రీపతి రావడం ఆ పల్లెటూళ్ళో వారికి విచిత్రంగా తోస్తుంది. శ్రీపతి నిజంచెపుతాడు... యీ వూరు చూద్దామని వచ్చానంటాడు. ఇదేం మహాపట్టణమా... చూడడానికి. వాళ్ళకి శ్రీపతి సమాధానం అర్థంకాదు. వాళ్ళకర్థమయేలా చెప్పడానికి శ్రీపతి శ్రమపడడు.

ఈ సారి శ్రీపతి ఒకపల్లెటూరు వెళ్ళాడు. తెల్లని మామూలుపంచె, తెల్లని చొక్కా, అతుకు చెప్పులు, చేతిలో ఒకసంచీ,—ఏ ఆడంబరమూ లేని యీ ఆకారం, పట్టణంనుంచి వచ్చిందని వాళ్ళనుకోలేదు. సాయంకాలమయేదాకా ఎక్కడెక్కడో తిరిగి, అన్నీ చూశాడు. పల్లెటూళ్ళ వాళ్ళకి ఏమీ తొందరలేదు. గంటలు, నిముషాలతో నిమిత్తంలేని జీవితం వాళ్ళది. పట్టణంలో మల్లె పరిగెత్తవలసిన పనిఉండదు.

ఈ పల్లెటూరు శ్రీపతికి చాలాబాగుంది. ఇంతకుముందొకసారి ఆ రోడ్డంట బస్సులో వెడుతూ చూశాడు. ఊరుముందు ఒకచెరువు, దాని ప్రక్కగా కాలిదారి - చెరువు ప్రక్కన ఒకపెద్దచెట్టు, అందంగా వంగిన కొమ్మలు, చెట్టు మొదట సిమ్మెంటుదిమ్మ, దానిమీద సావకాశంగా కబుర్లుచెప్పుకునే పురుషులు - యిదేదో అద్భుతంగా కనిపించింది శ్రీపతికి. అందుకనే యీ సారి ఆ వూరు వెళ్ళాడు శ్రీపతి. ఆ చెరువు పక్క కాలిదారిమీదుగా, ఊళ్లోకి దారి. ఆ యిళ్ళూ, వాటిమధ్య పెద్దపెద్దచెట్లూ, కంచెలు కట్టిన పెద్దపెద్ద దొడ్లూ, ఎంతో హాయిగా ఉన్నాయి. పట్టణంలో మరీ విసిగెత్తేట్టు ఇళ్లన్నీ ఒక్కలాగే ఉంటాయి. అక్కడ పార్కుల్లో చెట్లుకూడా మనిషిచెప్పినట్టే పెరుగుతాయి.

చీకటి పడుతోంది. ముసురుకునే మసక చీకట్లలో ఏవో ఆకారాలు అస్పష్టంగా కదులుతూన్నాయి. ఎద్దుల మెడగంటలు వినబడుతున్నాయి. ఎక్కడో ఒకచోట ఒక చిన్న దీపం కనిపించింది—చీకటి ఎంత అందంగాఉంటుంది!

ఎదురుగుండా కనిపించినగుమ్మం ఎక్కాడు శ్రీపతి. 'ఏమండోయ్' అని పిలిచాడు. ఆయనెవరో ముసలాయన. "ఎవరూ నాయనా?" అన్నాడు. "నాపేరు శ్రీపతి అంటారండి, యీ పక్కనే ఉన్న పట్టణంమాది. ఈ రాత్రికి యిక్కడపడుకోడానికి వీలుంటుందా అండి?" "ఉండకేం నాయనా! ఏంభాగ్యం?...లోపలికి రా బాబూ రేఖా!—కాళ్లుకడుక్కోడానికి నీళ్లు పట్టా అమ్మా..." అంటూ ముసలాయన లోపలికి దారితీశాడు. శ్రీపతి లోపలికి వెళ్ళాడు. ఇంట్లో అందరూ తలోపనీ చేస్తున్నారు. ముసలాయన తనతో కబుర్లు చెపుతున్నాడు. శ్రీపతి కాళ్లుకడుక్కుని తుడుచుకుని కూచున్నాడు

"అయితే - నువ్వు పట్టణంలో ఎవరబ్బాయివి బాబూ... మీ యింటిపేరు?... అల్లాగా!... మీరెంతమంది అన్నదమ్ములు?... అక్కచెల్లెళ్లున్నారా? పెళ్ళిళ్ళయినాయా? యిలాంటి లక్ష సంగతులడుగుతాడు ఆయన. శ్రీపతి అన్నింటికీ సమాధానంచెపుతాడు. ఈ ముసలాళ్ళకి-ప్రపంచమంతా ఒక కుటుంబం. ప్రతిమనిషి వాళ్ళచుట్టం. పట్టణంలో తనపక్కవాడెవడో తనకి తెలియదు. తను తెలుసుకోడు.

"లే బాబూ, కాళ్లుకడుక్కో. భోజనానికిలే. యిప్పటికే ఆలస్యం అయింది" అన్నాడు ముసలాయన.

"లేవండీ, నేను భోజనం చెయ్యను. మీకెందుకు అనవసరపుశ్రమ. నా దగ్గిర బిస్కెట్లూ అవీ, ఉన్నాయి, నేను ఏ వూరు వెళ్ళినా ఎవ్వరినీ శ్రమపెట్టడం యిష్టంలేదు."

"ఏమిటయ్యా యీ కబుర్లు. యింటికివచ్చి భోజనం చెయ్యకుండా పడుకోవడం యీ కాలపు నాగరికతా ఏమిటి? మాకామాత్రం దేముడిచ్చాడులే...వచ్చిన అతిథికి భోజనం పెట్టకపోవడం మాకింకా అలవాటులేదు." శ్రీపతికి భోజనం చెయ్యక తప్పిందికాదు. ఆ ముసలావిడ అచ్చంగా అన్నపూర్ణ. ఆవిడని చూస్తూంటే ఎవరో జ్ఞాపకం

వస్తున్నారు...తన చిన్నప్పుడు చచ్చిపోయిన అమ్మమ్మ. కన్నకొడుకులా ఆదరించింది తనని.

ఇంతకీ, తనెవడో యీ యింటివాళ్ళ కెవ్వరికీ తెలియదు. తను భాగ్యవంతుడనికూడా తెలియదు. ఈరకమయిన ఆదరణ కొన్ని కుటుంబాలలో ఉంటుంది కాబోలు. సుఖంగా నిద్రపోయాడు శ్రీపతి. ఆరుబయట పడుకోవడంవల్ల చక్కగా నిద్రపట్టింది. తెల్లవారుఝామునే లేచి వెళ్ళిపోదామనుకున్నాడు కాని గాఢనిద్ర పట్టేసింది - మెలకువరాలేదు.

రెండోబస్సు చాలా సేపటికిగాని రాదు. తను లేచేసరికి ఊరంతా లేచింది. అందరూ యెవరి పనుల్లో వాళ్లున్నారు ముసలాయన పశువులకి గడ్డివేస్తున్నాడు. ఆ అమ్మాయి జడవేసుకుని, జడగంటలు పెట్టుకుని. పరికిణీకట్టి, వోణీవేసుకుని, అమ్మకి ఏదో పనిలో సాయంచేస్తోంది. తమ్ముడు చద్దన్నం తిని, చొక్కాలాగు తొడుక్కుని తల దువ్వుకుని పలకా పుస్తకాలు వెతుక్కుంటున్నాడు— బళ్ళోకి వెళ్ళడానికి. ముందు వాకిటిలో లేతఎండలో పడకకుర్చీలో పడుకుని అంతా చూస్తున్నాడు శ్రీపతి. అలాంటి వాతావరణంలో సిగరెట్టు కాల్చబుద్ధవలేదు. అతనికి. ఇంతట్లో ఆ అమ్మాయి ఫలహారం తెచ్చిపెట్టింది. గ్లాసుతో పాలు తెచ్చింది. ఎంతో అమాయకంగా కనిపిస్తుంది ఆ అమ్మాయి. నాగుపాములా జడకదులుతూంటే లోపలికి పరుగెట్టింది-నల్లటి సన్నటి అమ్మాయి. "మీ పట్నంలోకి మల్లె యిక్కడ కాఫీ హోటళ్లుండవు, ఏదో యింట్లో చేసిందే తినాలి, బాగోలేదో" అన్నాడు ముసలాయన.

"ఇంత బాగుండవండీ, మా హోటలు పదార్థాలు" అన్నాడు శ్రీపతి.

వాళ్ళతమ్ముడు పలకపుచ్చుకుని బళ్ళోకి వెళ్తున్నాడు-శ్రీపతి అతన్ని పిలిచాడు.

"నీ పేరు?"

"పాండురంగడు"

"ఏం చదుతున్నావు"

"మూడోక్లాసు"

"మాపట్నం వస్తావా? ఎంచక్కటి పే...ద్ద బడి ఉంది. బోలెడు మేష్టర్లున్నారు."

"ఊఁ...హూఁ."

"ఏం? ఎందుకురావు?"— ఆ అబ్బాయికి సమాధానం తెలియదు. వాళ్లక్కయ్య స్థంబానికి ఆనుకుని, ఒకకాలు మడిచి, చేతులు వెనక్కిపెట్టి స్థంబాన్ని పట్టుకుని నిలబడి ఉంది.

"మీ పట్టణంలో వాళ్ళు మంచివాళ్ళు కారు" ఆ అమ్మాయి టక్కున సమాధానం చెప్పేసింది. తమ్ముడు పకాలున నవ్వాడు.

"నీకెవరు చెప్పారు?" అన్నాడు శ్రీపతి అటు తిరిగి.

ఆ అమ్మాయి లోపలికి పారిపోయింది.

శ్రీపతి ఆ అబ్బాయికి బిస్కట్లు పెట్టాడు. "పట్టణంవాళ్లు మంచి వాళ్ళేనా?" అన్నాడు. ఆ అబ్బాయి సంతోషంతో "చాలామంచివాళ్ళ"న్నాడు. బడిగంట వినిపించింది. అతను లేడిలా పరుగెత్తుంకుటూ బడికి వెళ్ళిపోయాడు.

శ్రీపతి రెండో బస్సుకి వెళ్ళిపోతానన్నాడు. రెండోబస్సుకివెళితే భోజనానికి చెడతావు. అక్కడికి వెళ్ళేసరికి 12 గంటలవుతుంది. భోజనంచేసి బయల్దేరు, మూడో బస్సులో అంది ముసలావిడ. ఆవిడ మాట్లాడుతుంటే అమ్మమ్మ మాటల్లే ఉన్నాయి. ఏమీ అనలేకపోయాడు శ్రీపతి.

"పట్టణంలో అయితే పార్కులూ, రేడియోలూ, సినీమాలూ... యిక్కడేం ఉన్నాయి నీబోటి వాళ్ళకి ఏంతోస్తుంది?" అన్నాడు ముసలాయన. ఆయన పని అంతా అయిపోయింది. ఎవరో రైతులు వచ్చారు. తనూ, ఆయనావాళ్లు, ఏవోకబుర్లు చెపుతూకూర్చున్నారు. ఏవేవోచాల సంగతులుమాట్లాడారు. ప్రొహిబిషన్ ఎక్స్పెర్మెంటు, గవర్నమెంటు వాళ్ళపనులు, యింకో యుద్ధం, ఇలాంటివెన్నో. శ్రీపతి తనకి తోచినవి చెప్పాడు. అతనంతగా మాట్లాడే తరహావాడుకాదు.

"ఇంక యిలాకబుర్లేనా? భోజనానికి లేవడం ఉందా, నువ్వు లేనాయనా. ఆయనకి కబుర్లుంటే భోజనం అక్కర్లేదు"అంది ముసలావిడ. ముసలాయనా, శ్రీపతీ లేచి భోజనం చేశారు.

శ్రీపతికి బస్సు టైమయిపోతోంది. సంచీతీసుకుని బయలుదేరాడు. యింటిల్లిపాదీ గుమ్మంలోకి వచ్చారు. "మా ఊరొకసారి రండి మరచిపోకండి. బస్సుస్టాండు కెదురుగుండానే మా యిల్లు పట్టణంలో వాళ్ళు మంచివాళ్ళు కారంటుంది మీ

అమ్మాయి-మేం ఎంత మంచివాళ్ళమో చూపిస్తాము” నవ్వుతూ అన్నాడు శ్రీపతి. ఆ అమ్మాయి ముత్యాలపళ్లకి వోణీ చెంగు అడ్డం పెట్టుకుంది. శ్రీపతి వెళ్లిపోయాడు.

*　　　*　　　*

శ్రీపతి పట్నం చేరాడు. ఇదొక ప్రపంచం-తను వెళ్ళివచ్చినది మరొక ప్రపంచం—మళ్ళా, ట్రాములూ, టాక్సీలూ, బజారులూ, గుండె కొట్టుకున్నంత వేగంగా నడవడాలూ, ఎలక్ట్రిక్ దీపాలూ ... పట్టణం అందమైనదే-అందులో పల్లెల్లో లేని ఎన్నో అవకాశాలున్నాయి. పల్లెటూరు అందమైనదే. అందులో పట్నంలో దొరకని ఎన్నో స్వచ్ఛమయిన అందాలున్నాయి. శ్రీపతి తన యింటికి వచ్చిచేరాడు. మామూలుగా తన పనుల్లో మునిగిపోయాడు;

ఉదయబాల పరీక్ష ఫలితాలు వొచ్చాయి. బి.యే. పాసయ్యింది. ఆవిడ సంతోషానికి అంతు లేదు. వెంటనే ఫోన్‌లో బావని పిలిచి యీ వార్త చెప్పింది. అతను చాలా హృదయపూర్వకంగా అభినందించాడు. ఏంచేస్తావు అన్నాడు. ఇంకా ఆలోచించాలి అంది ఉదయబాల. అవును తరవాత ఏదో చెయ్యాలి. బహుశా ఎయ్. ఏకి వెళ్ళాలా?—నాన్న ముందు పెళ్లి చేయడానికి తొందరపడుతున్నాడు. బావ-తనూ-హాయిగా ఉండొచ్చు. తను చదువుకోవడం బావకి యిష్టమే గా. బావ తనని తప్పకుండా చేసుకుంటాడు. తనవంటి అపురూప సౌందర్యవతి, నవనాగరిక లక్షణ లక్షిత, కోరివరించితే కాదనగల శ్రీశుకుడు కాదు శ్రీపతి.

ఆవేళ ఉదయబాల శ్రీపతి యింటికి వచ్చింది. శ్రీపతిని తనా రోజు సాయంత్రం చెయ్యబోయే టీపార్టీకి ఆహ్వానించింది. శ్రీపతి సరేనన్నాడు. తను వెళ్ళిన పల్లెటూరు చాలా అందంగా ఉందన్నాడు శ్రీపతి, ‘పల్లెటూరు అంత మేమిటో బావా-నీ మాటలు మరీను’ అంది ఉదయబాల. ఇలాంటి మాటలు ఆవిడకి నచ్చవు. సరే-సాయంత్రం తప్పకుండా వస్తావుగా - అంది ఉదయబాల... టకటకా వెళ్ళిపోతూ. శ్రీపతి కళ్ళల్లో ఆ పల్లెటూరి అమ్మాయి మెదిలింది. ఆ అమ్మాయి నడిస్తే యిలా టకటకలు వినపడవు.

ఆవేళ శ్రీపతి టీపార్టీకి వెళ్ళలేదు. వెళ్దాం అనుకుంటూ పడుకున్నాడు. ఒక అద్భుతమైన కథకి ఆలోచన తట్టింది. అది ఎంత బాగుందంటే వెంటనే కథ రాసెయ్యక ఉండలేకపోయాడు. అంతే—కథ పూర్తయ్యేసరికి సాయంత్రం ఆరున్నర అయిపోయింది. అరరె...ఉదయబాలని మనస్సు కష్టపెట్టానే...అని నాలిక కరుచుకున్నాడు. గబగబా ఫోన్ దగ్గిర కెళ్ళి, ఉదయబాలని పిల్చాడు. ఆవిడకి చాలా కోపంవచ్చింది. తను చెప్పిన కారణం ఆవిడకి అర్థంకాలేదు. అంత ఒళ్లు మరిచి ఎవరేనా రాసుకుంటూ కూచుంటారని ఆవిడ ఊహించలేదు. మొత్తంమీద ఆవిడని తృప్తిపరచలేకపోయాడు తన మాటల్తో. శ్రీపతి తన పొరపాటుకి చాలా బాధపడ్డాడు.

కొద్ది రోజుల్లో శ్రీపతి పెళ్ళి, ఊహల్లోంచి మాటల్లోకి దిగింది. శ్రీపతి మేనమామ ఒకరోజున శ్రీపతి నాన్న నడిగేడు. ఆయన అంగీకరించేసినట్టే-శ్రీపతికి యీ పెళ్ళి యిష్టమేనని అతని నాన్నగారికి తెలుసు. అయినా వాడినోట విందామని ఒక రోజున ఆయన శ్రీపతి నడిగారు. “ఏమిరా...మరి మామయ్య తొందరపడుతున్నాడు...ఈ నెల్లో ముహూర్తాలున్నాయి.”

“నా కిప్పుడు పెళ్ళివొద్దు నాన్నా... నేను చేసుకోను.”

అదిరిపోతూ డాయన-ఏమికిటా-ఆ అమ్మాయి వద్దా-అసలు పెళ్ళే వద్దా?

శ్రీపతికి పెళ్ళి అసలు చేసుకోకూడదనే ఉద్దేశ్యం ఎన్నడూ లేదు. కాని యీ అమ్మాయి అంటే ‘బాల’ వద్దు. ఈ అభిప్రాయానికి తను ఎప్పుడు వచ్చాడు? సరిగ్గా చెప్పలేదు. బహుశా నాన్నగారితో మాట్లాడుతున్నప్పుడే. అయితే ఎవర్ని చేసుకోవాలి? మెఱుపులా ఆలోచన తట్టింది. ఆ పల్లెటూరి అమ్మాయినే చేసుకోవాలి. ఆలోచించేకొద్దీ ఈ అభిప్రాయం బ్రహ్మాండంగా కనిపించింది. ఇందుకనే తను ఉదయబాలని చేసుకోనన్నాడు. ఆ అమ్మాయిని ఊహించుకునే సరికి శ్రీపతికి మత్తెక్కినట్టయింది. ఆనందంతో మెరుపు తీగలాంటి మనిషి. మల్లెపూలు పూసినట్టు నవ్వు-నాగుపాములాంటి జడ-శ్రీపతికి ఈ ఊహ పట్టరానంతగా, లోకోత్తంగా తోచింది. శ్రీపతికి

ఆ పేరు - రేణుక-తలుచుకునే సరికల్లా వడలు పులకరిస్తుంది. ఎంత స్వచ్ఛమయిన అందం ఆ అమ్మాయి!

శ్రీపతి నాన్నగారు ఎంత మొత్తుకున్నా, తమకు తగని సబంధంఅని ఎంతగోలపెట్టినా, శ్రీపతి వినలేదు. శ్రీపతిలో యింతగట్టి పట్టుదల నిరాఘాటంగా తనయిష్టాలు నెరవేర్చుకునే శక్తి ఉన్నాయని అతని స్నేహితులు ఎప్పుడూ అనుకోలేదు. ఉండిఉండి, యింతగొప్ప సబంధం తమ పిల్లకొస్తుందని ఆ తల్లిదండ్రులు అనుకోలేదు. ఏదో గమ్మత్తుగా యింటికొచ్చి, ఒక్కపూట ఉన్న అబ్బాయి అమాంతం అల్లుడైపోతాడని వాళ్ళెప్పుడూ ఊహించలేదు. ఇంక ఆ అమ్మాయి సంగతి చెప్పనక్కరలేదు. తను ఒక మహాపట్టణంలో ఒక ధనవంతుల యింటి కోడలు. తనభర్త, ఒక పెద్ద ఉద్యోగి-కలెక్టరో... ఆపైనో! ఊరికినే వచ్చినట్టువచ్చి ఎంతపనిచేశారు ఆయన. దొంగ! రేణుకి తనన్న మాటలు తలుచుకుంటే సిగ్గేస్తుంది...నవ్వొస్తోంది "పట్టణంలో వాళ్ళు మంచివాళ్లు కారు" "నీకెవరు చెప్పారు" ఆమాటలే మళ్ళామళ్ళా జ్ఞాపకమొస్తున్నాయి. ఆ దృశ్యమే మళ్ళామళ్ళా కళ్ళల్లో మెదుల్తోంది. ఆయనేమనుకున్నారో!

శ్రీపతికి పెళ్లి అయిపోయింది - రేణుకతో. ఉదయబాల అహం దెబ్బతిన్నది. లేకపోతే తనంతటిది, తానుగా వరించితే శ్రీపతి కాదంటాడా? అదీకాక ఒక పల్లెటూరిదాన్ని ఏం అందంగా ఉందని తెచ్చి కట్టుకున్నాడు. ఉదయబాలలో యీ భావం చాలా విపరీతమైపోయింది. స్త్రీలు అహం దెబ్బతింటే-సింహాలైపోతారు. వాళ్లకి ప్రేమైనా, ద్వేషమైనా, ఒకపట్టాన కలగవు-కలిగినాయా-అవిఒకపట్టానపోవు అందులో ఏది కలిగినా వాటికి మనం చెప్పుకునే కారణాలు ఏమీ ఉండవు. ఇక వివక్షతా విచక్షణా ఉండదు. ఆ వ్యక్తిని మొదలంటా ద్వేషించడమో- మొత్తమంతా ప్రేమించడమో చేస్తారు. మన తర్కం, విజ్ఞానం, న్యాయం అన్నిచోట్లా ఋజువుకి నిలబడతాయి- కాని స్త్రీలవిషయంలో యివేవీ నిలబడవు.

రేణుక యింటికొచ్చినదగ్గిర్నుంచీ, ఆవిడని ఏదోరకంగా ఏడిపించడం పనిగా పెట్టుకుంది ఉదయబాల. రేణుకకి పట్టణం దేవేంద్రలోకంలా కనిపించింది. టెలిఫోన్ మోగితే ఏమిటో అనుకుని గాభరాపడింది. రేడియో పాడుతూంటే దాని వెనకాతల మనిషున్నాడేమోనని చూసింది. ఎలక్ట్రిక్ పొయ్యిచూసి నోరువిప్పి ఆశ్చర్యపోయింది. ఉదయబాల రేణుకని ఆడించేది. వేళాకోళం చేసేది. పల్లెటూరి బయితనేది. ఇలా పనికట్టుకుని రేణుకలో ఒక రకమయిన అభిమానం రెచ్చగొట్టింది. రేణుక బాలమల్లే ఇంగ్లీషు నేర్చుకోలేకపోయినందుకు విచారించింది. ఏమయినాసరే తను పట్టుపట్టి బాలమల్లే అన్నీ నేర్చుకోవాలి. అప్పుడు చూపించాలి తడాఖా.

రేణుక వచ్చినదగ్గరనుంచీ శ్రీపతిని, ఉదయబాల జమదగ్ని అనిపిలిచేది. అతనేదీ పట్టించుకునేవాడు కాదు. అతనికి రేణుకే ప్రపంచం. ఆ పిల్ల అమాయికత్వం, పల్లెటూరి అలంకరణ, అలవాట్లూ, మువ్వల పట్టీలు, నాగరం, జడగంటలు, పరికిణీ,—యీమె ఏదో కొత్తలోకం లోంచి ఊడి పడ్డట్టు ఆరాధించేవాడు. రేణుక కదిలితే అతనికి మెరుపులు కనపడేవి. రేణుక నవ్వితే పువ్వులు వికసించేవి - ఆమెకళ్ళల్లో, పళ్ళల్లో, చెక్కిళ్ళల్లో అతనిముఖం కనపడేది. రేణుక దగ్గరగా నిలబడితే ఏదో ఆపాదమస్తకం విద్యుత్ప్రవాహానుభూతి పొందేవాడు. రేణుక తను స్వర్గంనుంచి ఏరికోరి తెచ్చుకున్న దేవతలా కనిపించేది. అతనికి యింక మిగతావాళ్ళమాటల్తో పనిలేదు - రేణుకచాలు.

కాని రేణు స్థితివేరు. ఆడవాళ్ళకి భర్తప్రేమ ఒక్కటే కాకుండా - యింకా ఏవో కావాలి. అవి, సాటివాళ్ళల్లో గొప్పతనం, హోదా. అప్పుడే పల్లెటూరినించి వచ్చిన అమాయికపు పిల్లలో యీ సహజమైన అభిప్రాయం యింకా బలంగా ఉంది. తనకి తెలిసిన ఆడవాళ్ళంతా తనని ప్రతినిమిషం పల్లెటూరి గబ్బిలాయి అంటూంటే భరించలేకపోయింది. ఉదయబాలకి తను యింగ్లీషు చదువుకున్నానని దొరసానిలా ఉంటాననీ ఎంత గర్వం! అనుకుంది.

శ్రీపతిదగ్గిర రేణుక యింగ్లీషు చదువుకోవడం ప్రారంభించింది. ఈ పని శ్రీపతికీ సరదాగా

తోచింది. మెల్లిగా, ఒక్కొక్కటే పట్నపుటలవాట్లు నేర్చుకుంది. పౌడరుతో ప్రారంభించిన రేణుక అలంకరణ యిప్పుడు పూర్తిగా పట్నపు పద్ధతిలోకి వచ్చేసింది. ఆమెకి పట్టణం ఒక దేవేంద్రలోకం. ఎత్తు మడమల బూట్లు, యెర్ర రంగు పెదిమలు, కత్తిరించుకున్న జుట్లు,—యిలా ఒకదాని తరవాత ఒకటి–రేణుక పూర్తిగా మారిపోయింది. తను ఎంతో అభివృద్ధిచెందాననుకుంది. తన పూర్వపు టాకారం, తెలివితక్కువతనం తలుచుకుని నవ్వుకునేది. ఇంగ్లీషు నేర్పినందుకు తన భర్తని అభినందించింది.

ఇప్పుడు రేణుక బాగా యింగ్లీషు మాట్లాడగలదు. చకచకా అందరితో వ్యవహరించగలదు. స్వయంగా పట్టణమంతా కొనేసిరాగలదు. పేరు కూడా 'మిసెస్ రేణుకా శ్రీపతి' అని రాసుకోగలదు. రేణుక ఆరోగ్యంలోకూడా చాలా మార్పు వచ్చింది. ఇప్పుడావిడ అమెరికానుంచి వచ్చిన ఒక పుస్తకం సహాయంతో వ్యాయామం చేస్తోంది. ఇప్పుడు రేణుక పౌడరు, యింకా ఏవేవో రాసుకుతీరాలి. లేకపోతే మొహం బాగుండదు. ఇప్పుడు రేణుక జుట్టుకి పిన్నులు పెట్టుకోకపోతే భయంవేస్తుంది. "ఎటికేట్"కి భంగమని రేణుక మునుపులా నవ్వడం మానేసింది. ఎత్తు మడమల బూట్లలోదూరి రేణుకపాదాలు ఆకారం మారిపోయాయి. రేణుక కళ్లు యిప్పుడు యింక గుచ్చుకోవు.

శ్రీపతిలో యీలోగా ఎంతోమార్పువచ్చింది? ఏదేనా వస్తువు విలువ అది పోయాకగాని తెలియదు. రేణుకని ఎందుకని అంతగా ఆరాధించాడో ఆవిడ మారిపోయాకగాని శ్రీపతికి అర్థంకాలేదు. రేణుక అమాయకత్వం, సహజత్వం, పోతూంటే వాటికోసమే రేణుకని తను తెచ్చుకున్నాడని శ్రీపతికి బోధపడసాగింది. కాని రేణుక అలా మారిపోడానికి తనే కారణం అనుకున్నాడు శ్రీపతి. ఆమెని మ్యూజియంలో అపూర్వవస్తువులాగా అట్టే పెట్టబోయి విఫలుడయ్యాడు. ఆమె అలా మారిపోతే బాగుండదని తనకి తెలిస్తేగా ఆమెకి బోధపరచడానికి.

బహుశా రేణుకకికూడా తనలో యీ కొత్త అలవాట్లు వచ్చి, సహజత్వాన్ని తరిమేశాయని కొన్నాళ్ళకి తెలుస్తుంది. ఒకరకమైన 'గ్రెషామ్ సిద్ధాతం' ఈ విధంగా రేణుకకికూడా తెలుస్తుంది. కాని అప్పటికి చాలా ఆలస్యమయిపోతుంది. ఇప్పటికీ ఆలస్యం అయిపోయింది. గడియారం ఎవరూ వెనక్కి నడిపించేరు. రేణుక తప్పేమీ లేదు. పట్టణంలోకి ఏమీ తెలియకుండా అడుగు పెట్టిన ప్రతి పల్లెటూరి అమ్మాయీ రేణుకలాగే ప్రవర్తిస్తుంది.

కాని-యిప్పుడు రేణుక శ్రీపతికి మునపట్లా ఆరాధ్యదైవం కావటంలేదు. రేణుకని పలకరించగలడు - కాని మునపట్లా వళ్లు పులకరిస్తోంటే కాదు. ఇప్పుడు రేణుకని కౌగలించుకున్నా తన కేవికారమూ కలగదు. రేణుకముందు నించుంటే తానొక స్త్రీముందు నించున్నాడనే భావం కలగడం మానేసింది శ్రీపతికి. అయినా రేణుక స్త్రీ-నవనాగరికస్త్రీ.

---

చకోస్లొవాకియాలో రష్యనులను గురించి చెప్పుకుంటున్న జోక్ ఇది:

ఒక రష్యన్ యాత్రికుడు ప్రాగ్ నగరానికివచ్చి రష్యన్ మందుల్ని గురించి సొరకాయ కోతలు కోస్తున్నాడు. "సోవియట్ యూనియన్‌లో ఒక డాక్టరు ఉన్నాడు. ఒక గుడ్డివాడి కళ్లు రెండూ తీసివేసి, కొత్తకళ్లు పెట్టాడు. ఆ గుడ్డివాడిప్పుడు నిక్షేపంలాగ చూస్తున్నాడు."

ఇది వినిన చెక్ దేశీయుడు "మా డాక్టరు చేసిన అద్భుతం ముందు ఇది ఎంతలే!" అన్నాడు. అదేమిటని రష్యన్ అడిగితే ఇలా చెప్పాడు: "మా డాక్టర్లు ఒక మొండిచేతి మనిషి చేతికి ఆపరేషన్‌చేసి, వేళ్లకు బదులుగా ఆవుచళ్లు అతికించారు. వాడు ఆ వేళ్లు నోట్లోపెట్టుకొని పీలిస్తే పాలొస్తున్నాయి."

"ఇది ఎవరు చూశారు?" అని రష్యన్ అడిగాడు. "మీ వైద్యుడి చేత కళ్లు ఆపరేట్ చేయించుకున్నవాడే!" అని చెక్ మనిషి సమాధానం.